నేడు యధావిధిగా స్పందన

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం కలెక్టరేట్లో సోమవారం యధావిధిగా జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోను స్పందన కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధిగా హాజరుకావాలని కోరారు. స్పందనకు వచ్చే ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని సూచించారు.

పల్లెబాటలో కొత్తనేతలు

సేవా కార్యక్రమాల పేరిట హడావుడి
ఎన్నికల్లో టిక్కెట్, ఆపై గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
ఆయా పార్టీల్లో పెరుగుతున్న అంతర్గత పోరు

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

సార్వత్రిక ఎన్నికలకు మరో సంవత్సరం గడువుంది. మారుతున్న రాజకీయ పరిణామాలతో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆయా పార్టీల నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఆశావహులు అధిష్టానం వద్ద టిక్కెట్ల కోసం తమ ప్రయత్నాలు పెద్దఎత్తున సాగిస్తున్నారు. అయితే అదే సమయంలో అటు అధిష్టానంతోపాటు ఇటు జనాన్ని ప్రసన్నం చేసుకునేందుకు, ప్రధానంగా గ్రామాల్లో తమకు అవసరమైన కేడర్‌ను తమ వైపు తిప్పుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. అదే సమయంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ప్రముఖులు వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు సన్నద్ధమవుతున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, ముంబై వంటి నగరాలతోపాటు ఇతర దేశాల్లో స్థిరపడిన కొందరు తాజాగా తమ కార్యకలాపాలు స్థానికంగా ప్రారంభిస్తున్నారు. వృద్ధులకు దుస్తుల పంపిణీ, ఏదైనా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, ప్రమాదాల బారిన పడిన వారికి ఆర్థిక సాయంతోపాటు స్థానికంగా జరుగుతున్న కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందిస్తూ ఆయా కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఫోకస్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా తమ పేరిట గాని, తమ పెద్దల పేరిటగాని సంస్థలు, ట్రస్టులు వంటి వాటి పేరిట ఈ కార్యక్రమాలు సాగిస్తూ జనానికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తుండటంతోపాటు కొంతమంది యువతను తమ వెంట తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అధికార పక్షమైన వైసిపికన్నా ప్రతిపక్ష టిడిపి, జనసేనల్లోనే ఎక్కువగా ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని నూజివీడు, చింతలపూడి, తాడేపల్లిగూడెం, నరసాపురం నియోజకవర్గాల్లో టిడిపి తరఫున పోటీ చేసేందుకు ఆయా ప్రముఖులు రంగం సిద్ధం చేసుకునే ప్రయత్నాల్లో తలమునకలయ్యారు. ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు మళ్లీ శివ స్వచ్ఛంద సంస్థ పేరిట కార్యక్రమాలు ప్రారంభిస్తానని ఇటీవల జరిగిన తన పుట్టిన రోజు వేడుకల్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. గతంలో ఆయన నరసాపురం ఎంపీ స్థానానికి టిడిపి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత కొంతకాలం స్తబ్ధతగా ఉన్న శివ ఇటీవల నియోజకవర్గంలో తన కార్యకలాపాలు ముమ్మరం చేశారు. అయితే ఇక్కడ సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు శివకు వరుసకు సోదరుడు. మరి రామరాజును కాదని శివకు టిడిపి అధిష్టానం ఎంఎల్ఎ టిక్కెట్ ఇస్తుందా లేక శివ వేరే పార్టీ నుంచి బరిలోకి దిగే అవకాశం ఉందా అనేది చర్చనీయాంశమైంది. ఇప్పటికే అధికార పార్టీ శివకు టిక్కెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చి పార్టీలో చేర్చుకోవాలని కొందరు నేతలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే ఇదే నియోజకవర్గంలో స్వగ్రామంలో ఉన్న మాజీ మంత్రి ఒకరు తన కుమారునికి టిక్కెట్ ఇప్పించుకోవడం కోసం శివ చేరికను అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది.

మొత్తానికి ఎన్నికలు సమీపించేసరికి ఇక్కడ రాజకీయ పరిణమాలు ఎలా ఉంటాయో అంతుచిక్కని పరిస్థితి ఉంది. నరసాపురంలో మాజీ ఎంఎల్ఎకు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికి పచ్చగడ్డి వేస్తు భగ్గుమనేలా విబేధాలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒక ప్రముఖుడు టిక్కెట్ కోసం తన సేవా కార్యక్రమాలు ముమ్మరం చేశారనే ప్రచారం సాగుతోంది. ఇక అధికార పార్టీ వైసిపి టిక్కెట్ల కోసం కొందరు అధికారులు తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా చింతలపూడి నియోజకవర్గంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. అయితే టిక్కెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నా జనం వైపు మాత్రం ఈ అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. అలాగే నూజివీడు, పోలవరం, ఆచంట తదితర నియోజకవర్గాల్లో జనసేన తరపున పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్న కొందరు ఆశావహులు సేవా కార్యక్రమాలు ముమ్మరం చేశారు. మొత్తంగా ఎన్నికలకు సంవత్సరం సమయం ఉన్నా సేవా కార్యక్రమాలతో ప్రముఖుల సందడి, ఇటు అధికార పార్టీ నేతల గడపగడపకూ మన ప్రభుత్వం, అటు టిడిపి నేతలు వివిధ కార్యక్రమాలతో గ్రామాల్లో రాజకీయాలు క్రుపీ వేడెక్కుతున్నాయి.

మాజీ మంత్రి వట్టి కన్నుమూత

స్వగ్రామం ఎంఎంపురంలో అంత్యక్రియలు
నివాళులర్పించిన పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలు, ప్రముఖులు

వసంత్‌కుమార్ (ఫైల్‌ఫోటో)



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - ఉంగుటూరు, భీమడోలు

మాజీ మంత్రి, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ వట్టి వసంత్‌కుమార్ (70) ఆదివారం తెల్లవారుజామున విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో కిడ్నీ సంబంధిత ఇబ్బందులకు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించారు. ఆయన భౌతికకాయాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో సొంతూరు భీమడోలు మండలం పూళ్ల పంచాయతీ పరిధి ఎంఎంపురానికి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు తరలించారు. అప్పటికే ఆయనకు నివాళు లర్పించేందుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు అభిమానులు, కార్యకర్తలు తదితరులు వసంత్‌కుమార్ ఇంటి వద్దకు చేరుకున్నారు. సాయంత్రం వరకూ ప్రముఖుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఇంటి వద్దే ఉంచారు. వసంత్‌కుమార్ భౌతికకాయానికి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పిసిసి మాజీ అధ్యక్షులు కె.రఘువీరారెడ్డి, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, కెవిపి.రామచంద్రరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, కాంగ్రెస్, వైసిపి నాయకులు పెద్దసంఖ్యలో నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి దాడిశెట్టి రాజా విచ్చేసి నివాళులర్పించారు. అనంతరం వసంత్‌కుమార్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. స్వగృహం వద్ద నుంచి వసంత్‌కుమార్ భౌతికకాయాన్ని పోలీసు కవాతు నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అంతిమయాత్రలో గ్రామస్తులు, అభిమానులు వందలాదిగా పాల్గొన్నారు. వసంత్‌కుమార్‌కు పిల్లలు లేకపోవడంతో సోదరుడి కుమారుడు పవన్ తలకొరివిపెట్టారు. పోలీసులు గౌరవసూచకంగా గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, సినీ నిర్మాత అల్లు అరవింద్, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు, మాజీ ఎంఎల్ఎ కొండ్రెడ్డి విశ్వనాధం, ఈలి నాని, పసల కనకసుందర్రావు, జనసేన నేత పత్సమట్ల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వసంతకుమార్ జీవన ప్రస్థానం

భీమడోలు మండలం పూళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంఎంపురానికి (మల్కీ మహ్మద్‌పురం) చెందిన వట్టి వెంకట రంగ పార్థసారథి, వాసుకీదేవి దంపతుల ద్వితీయ కుమారుడు వట్టి వసంతకుమార్. ఆయన అన్న రమేష్‌నాయుడు హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లో వ్యాపారవేత్తగా ఉన్నారు. 1953లో పుట్టిన ఈయన ఆంధ్రప్రదేశ్ అటార్నీ జనరల్ తలారి అనంతబాబు కుమార్తె ఉమాదేవిని వివాహం చేసుకున్నారు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఆమె చనిపోయారు. బిఎస్‌సి (అగ్రికల్చర్), ఎంబిఎ చదివిన వసంతకుమార్ 1974-75 సంవత్సరాల్లో ఆంధ్రా యూనివర్సిటీలో ఫ్యాకల్టీగా పని చేశారు. 1973-76 మధ్య యూత్ కాంగ్రెస్ కన్వీనర్‌గా పని చేశారు. 1989-90 సంవత్సరాల మధ్య అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లు రవి కార్యవర్గంలో సంయుక్త కార్యదర్శిగా పని చేశారు. కేంద్ర వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో పని చేసే మెరైన్ ప్రొడక్ట్స్ విభాగంలో జాతీయ డైరెక్టర్‌గా 1985-88 మధ్య పని చేశారు. ఆ తర్వాత ఈ ఆక్వా ఫారం డెవలప్‌మెంట్ అధ్యక్షులుగా 1990 నుంచి 98 వరకు పని చేశారు. ప్రస్తుతం ఎపి ఆక్వా ఫార్మ్ డెవలప్‌మెంట్ విభాగం గౌరవాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. 2004లో తొలిసారిగా ఉంగుటూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి అభ్యర్థి గన్ని వీరాంజనేయులపై విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంఎల్ఎగా మరోసారి ఇదే నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా, ఆ తర్వాత కిరణ్‌కుమార్ మంత్రివర్గంలో పర్యాటక, క్రీడా శాఖ మంత్రిగా పని చేశారు.

అంత్యక్రియలు

జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన వసంత్‌కుమార్

వట్టి వసంత్‌కుమార్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుప్రసిద్ధ రాజకీయ కుటుంబానికి చెందినవారు. వారి తాత పసల సూర్యచంద్రరావు జిల్లా రాజకీయాల్లో కొన్ని దశాబ్దాలపాటు కీలక భూమిక పోషించారు. 1952లో అల్లంపురం నియోజకవర్గం నుండి ఎంఎల్ఎగా ఎన్నికై ఆంధ్రరాష్ట్ర శాసనసభ ఉప సభాపతిగా పని చేశారు. వసంత్‌కుమార్ తండ్రి వట్టి వెంకటరంగ పార్థసారథి జిల్లాలో సీనియర్ రాజకీయవేత్త. కాంగ్రెస్ పార్టీ నేతగా, డిసిసిబి ఛైర్మన్‌గా సేవలందించారు. సమావేశాలకు హాజరు కావడంలో వసంత్‌కుమార్ సమయపాలన కచ్చితంగా పాటించేవారు. రాష్ట్ర విభజన అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

డిప్యూటీ సిఎం కొట్టు సంతాపం

తాడేపల్లిగూడెం: మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలం వసంత్‌కుమార్ విశేష సేవలందించారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా జిల్లా అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. వసంత్ మృతితో తాను వ్యక్తిగతంగా మంచి మిత్రుడిని కోల్పోయానని విచారం వ్యక్తం చేశారు. జిల్లా రాజకీయాలకు ఆయన మృతి తీరని లోటని నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మంత్రి కారుమూరి సంతాపం

తణుకు: మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మృతి పట్ల రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. ఆయన అకాల మరణం బాధాకరమని పేర్కొన్నారు. తన రాజకీయ జీవితానికి పునాది వేసింది వసంత్‌కుమార్ అని, ద్వారకాతిరుమల నుంచి జెడ్‌పిటిసిగా పోటీ చేయడానికి ప్రోత్సహించి జెడ్‌పి ఛైర్మన్ పదవి కట్టబెట్టారని తెలిపారు. వసంత్‌కుమార్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, మంత్రి అంబటి రాంబాబు

వసంత్‌కుమార్ కుటుంబ సభ్యులకు ప్రముఖుల పరామర్శ

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

భీమవరం: మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. వట్టి వసంత్‌కుమార్ ఉంగుటూరు ఎంఎల్ఎగా, రాష్ట్ర మంత్రిగా రాష్ట్ర ప్రజానీకానికి అనేక సేవలందించారని గుర్తు చేశారు. వసంత్‌కుమార్ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిరస్మరణీయులు సత్యనారాయణ

ప్రజాశక్తి - తణుకురూరల్

మాట్లాడుతున్న మంతెన సీతారాం

సిపిఎం సీనియర్ నేత, కొత్తపాడు మాజీ సర్పంచి బొంతు సత్యనారాయణ చిరస్మరణీయులని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కొనియాడారు. ఆదివారం కొత్తపాడులో బొంతు సత్యనారాయణ సంస్మరణ సభ ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన జరిగింది. తొలుత సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పది సంవత్సరాలు ఏకగ్రీవంగా కొత్తపాడు గ్రామ ప్రజలు ఆయనను సర్పంచిగా ఎన్నుకోవడం సత్యనారాయణపై గ్రామ ప్రజలకు ఉన్న అచంచలమైన విశ్వాసమే కారణమని అన్నారు. మాజీ ఎంఎల్ఎ, టిడిపి నేత ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ బొంతు సత్యనారాయణ గ్రామ సర్పంచిగా, సిపిఎం నాయకులుగా సమర్థవంతమైన సేవలందించారని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ గ్రామంలో పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహించిన సత్యనారాయణ యువత, వ్యవసాయ కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారానికి పోలీసు నిర్బంధాలు, అరెస్టులు వంటి వాటికి వెనుకాడలేదన్నారు. తుదిశ్వాస విడిచే వరకూ నమ్మిన ఆశయాలకు కట్టుబడి అంకితభావంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపాడు సొసైటీ ఛైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు, ఇరగవరం ఎంపిపి అలివేలు మంగతాయారు, టిడిపి నాయకులు ఆరేటి రాము, దండు గణపతిరాజు, కునుకు జనార్ధన్, వైసిపి నాయకులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, బక్క శ్రీనివాస్, సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కె.సుబ్బరాజు, మల్లిపూడి కృష్ణమూర్తి, ఇల్లింద్రపర్తి సత్యనారాయణ, కెవిపిఎస్ నాయకులు బి.విజయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, వివిధ ప్రజాసంఘాల నేతలు కామన మునిస్వామి, టి.ముసలయ్య, పిల్లి కోటేశ్వరరావు, ఎ.అజయకుమారి పాల్గొన్నారు.

పుస్తకాలు అందిస్తున్న కలెక్టర్

పేరుపాలెం బీచ్‌కు పర్యాటకుల తాకిడి

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. సముద్ర స్నానాలు చేసి కేరింతలు కొట్టారు. చిన్నారులు, యువత ఒడ్డున ఇసుకతిన్నెలపై ఆటలాడి ఉల్లాసంగా గడిపారు. అనంతరం తీరంలో నున్న ఆలయాలను సందర్శించి సరివి, కొబ్బరి తోటల్లో భోజనాలు చేసి సేదతీరారు.

మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో బిఆర్‌ఆర్ అండ్ జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఆదివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్-2023 నిర్వహించారు. ఈ టెస్టుకు పాలకొల్లు పరిసర ప్రాంతాల నుండి 644 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు చేతుల మీదగా ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులు భవిష్యత్తులో వివిధ పోటీ పరీక్షలకు ఒకే నమూనాగా తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకునేందుకు ఈ స్కాలర్‌షిప్ టెస్ట్ ఉపయోగపడుతుందన్నారు. కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు మాట్లాడుతూ ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధించిన వారికి పూర్తి ఫీజు రాయితీ, 85 శాతం మార్కులు వచ్చిన వారికి 50 శాతం ఫీజు రాయితీ ఇస్తున్నామన్నారు. ఈ మెరిట్స్ స్కాలర్‌షిప్ టెస్టులో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సలేషన్ ప్రోత్సాహకాలు రూ.రెండు లక్షలు అందిస్తున్నామని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అత్యాధునిక లాబ్స్, ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన, విద్యార్థులకు ప్లేస్‌మెంట్ అవకాశాల కల్పన, విద్యార్థులను అన్ని రంగాల్లో అభివద్ధి చేసి సర్వతోముఖాభివృద్ధికి కళాశాల కృషి చేస్తుందన్నారు. మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టుకు హాజరైన విద్యార్థులకు ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్ స్కిల్స్ పుస్తకాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కోశాధికారి జల్లూరి రామలింగేశ్వరరావు, దేవరపు లక్ష్మీనారాయణ, ఇనుకొండ రంగారావు, మద్దుల కిరణ్, నెలకుర్తి సత్యనారాయణ, ఎకనామిక్ అడ్వయిజర్స్ ఎబిఎస్.మూర్తి, నందుల సీతారామారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.ఓల్గా పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పుస్తకాలు అందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

విద్యార్థులు బాగా చదువుకుని ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని, దానికి దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ అందిస్తున్న సహ కారం అభినందనీయమన్నారు. అనంతరం భీమవరం ఎస్‌సి హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్.శ్రీకర్, చీఫ్ అడ్వయిజర్ కెసి.రాజు, జిల్లా లీగల్ అడ్వయిజర్ ఎన్.భాస్కరరావు, కమిటీ సభ్యులు కుమార్, వై.ఏసుబాబు, రాజబాబు, ఎంఎం.కాళీ పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు సాయం అభినందనీయం

మాజీ ఎంఎల్ఎ శివ

కాళ్ల: రైతు బిడ్డ, వెలివర్రు పంచాయతీ బోర్డు మాజీ సభ్యుడు ముదునూరి సుబ్బరాజు పేరిట ఆయన కుటుంబ సభ్యులు మానసిక వికలాంగులను ఆదుకోవడం అభినందనీయమని ఉండి మాజీ ఎంఎల్ఎ, శివ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత వేటుకూరి వెంకట శివరామరాజు (శివ) అన్నారు. పెదఅమిరంలో అరుణోదయ మనోవికాస కేంద్రంలో ముదునూరి సుబ్బరాజు పేరిట పిల్లలకు రగ్గులు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, పండ్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ సుబ్బరాజు కుమార్తె రుక్మిణిబాల, అల్లుడు పొత్తూరి కృష్ణంరాజు, మనవడు పొత్తూరి ఫణివర్మ మానసిక వికలాంగులకు చేయూతనీయడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో వెలివర్రు మాజీ సర్పంచి టిడిపి మాజీ మండల అధ్యక్షుడు పొత్తూరి వెంకటేశ్వరరాజు, తెలుగు మహిళ మండలాధ్యక్షురాలు వత్సవాయి సుజాత, నాయకులు కాలువ వెంకట్రావు కెవి.నందు, వెంకటకృష్ణ, బురిడి రవిబాబు, మాండ్రు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో నినదిస్తున్న విద్యార్థులు

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని

ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యాన స్థానిక సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పతివాడ నాగేంద్రబాబు, తాడికొండ రవిబాబు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల బాగోగులను ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను వారు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 2018లో ఉన్న మెస్‌ఛార్జీలనే 2022లోను కొనసాగించడం దారుణమన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న రేట్లకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని వారు డిమాండ్ చేశారు. సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు వర్కర్లను కేటాయించకపోవడం ప్రభుత్వానికి హాస్టల్ విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి తెలియజేస్తుందన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోడూరు జెసిఎస్ కన్వీనర్‌గా ఏసుబాబు

ప్రజాశక్తి - పోడూరు

మండల జెసిఎస్ కన్వీనర్‌గా పైడి ఏసుబాబును ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు నియమించారు. ఏసుబాబు గతంలో వైసిపి జిల్లా కార్యదర్శిగా పని చేశారు. జెసిఎస్ కన్వీనర్‌గా నియమితులైన ఏసుబాబును జెడ్‌పిటిసి సభ్యులు పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, వైస్ ఎంపిపి రుద్రరాజు సీతారామరాజు, మండల నాయకులు అభినందించారు.

సూరిబాబుకు శివరామరాజు పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిడిపి సీనియర్ నాయకులు వేగేశ్న సూరిబాబును మండలంలోని మహాదేవపట్నంలో తన నివాసంలో మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు టిడిపి నాయకులతో ఆదివారం కలిసి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ సూరిబాబు రోడ్డు ప్రమాదంలో గాయపడడం చాలా బాధాకరమని వారు వాపోయారు. సూరిబాబు నిబద్ధత కలిగిన నాయకుడని పార్టీ పట్ల ఎంతో అంకితభావంతో పనిచేసేవారని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పొత్తూరి వెంకటేశ్వరరాజు, వనిమా శ్రీనివాస్, కరిమెరక శ్రీనివాస్, బురిడి రవిబాబు, వేగేశ్న మహేష్‌రాజు, వేగేశ్న సురేష్ రాజు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టు క్రీడాకారులను అభినందిస్తున్న పివిఎల్.నరసింహరాజు

క్రీడలతో ఉపాధి అవకాశాలు

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు పివిఎల్ అభినందన

ప్రజాశక్తి - పాలకోడేరు

క్రీడలతో యువత ఉపాధి అవకాశాలను మెరుగు పరచుకోవచ్చని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికైన పురుషులు, మహిళల జట్టు క్రీడాకారులు కొన్నిరోజులుగా పాలకోడేరులో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలో గౌహతీలో జరగనున్న జాతీయ స్థాయి వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తలపడనున్న జట్టు సభ్యులను ఆదివారం పివిఎల్.నరసింహరాజు అభినందించారు. తొలుత గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు నరసింహరాజు శంకుస్థాపన చేశారు. ఆయనతో పాటు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు, కొత్తపల్లి కాశీవిశ్వనాధరాజు, పాలా రాధాకృష్ణ, వెంకటరాజు ఉన్నారు.

ఘనంగా వెయ్యి కలశాల ఊరేగింపు

ప్రజాశక్తి - ఉండి

పెదపుల్లేరు గ్రామ దేవత సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవ సంబరాల్లో భాగంగా ఆదివారం సుమారు వెయ్యి కలశాల ఊరేగింపును కలిదిండి శ్రీనివాస్ వర్మ ఉమామహేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, గోకరాజు రామరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, జనసేన పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు హాజరయ్యారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా కప్పి సన్మానించి అమ్మవారి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, గోకరాజు రామరాజు, పాతపాటి సర్రాజు, కోటికలపూడి గోవిందరావు, జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవ కలశాల ఊరేగింపునకు హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ బాధ్యత తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కలిదిండి భాస్కరరాజు, కలిదిండి మురళీకృష్ణంరాజు, కలిదిండి శ్రీనివాస్‌వర్మ, కలిదిండి సీతారామరాజు, కలిదిండి సూర్యనారాయణ రాజు, నడింపల్లి సత్యనారాయణరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్య నిర్వాణాధికారి రామారావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

వద్దిపర్రులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని వద్దిపర్రు గ్రామంలో ఆదివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ఎంపిటిసి సభ్యులు శారదా చిట్టిబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొక్క నాగేశ్వరరావు, బొక్క సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వివరాలు వెల్లడిస్తున్న సిఐ

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

రూ.1.59 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు సర్కిల్ పరిధిలో చోరీలకు పాల్పడిన నిందితుడిని తణుకు రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.1,59,300 విలువైన వెండి వస్తువులు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను తణుకు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ఆంజనేయులు వెల్లడించారు. పెనుగొండ మండలం బాబుజీపురం గ్రామానికి చెందిన తానేటి ఆశీర్వాదం దొంగతనాలను వృత్తిగా చేసుకున్నాడని వివరించారు. ఈ క్రమంలో తణుకు పరిధిలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను ముందుగా రెక్కీ చేసుకుని, అర్ధరాత్రి సమయంలో చోరీలకు పాల్పడేవాడు. మారు తాళములతో ద్విచక్రవాహనాలు లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో తణుకు మండలం పైడిపర్రు గ్రామంలోని రైల్వేస్టేషన్ వెనుక వైపున గాంధీ బొమ్మల సెంటర్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆశీర్వాదాన్ని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 990 గ్రాముల వెండి వస్తువులు, బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితునిపై సుమారు 20కి పైగా కేసులు ఉన్నాయన్నారు. పెనుగొండ పోలీసు స్టేషన్‌లో సస్‌పెక్ట్ షీట్ ఉందని తెలిపారు. నిందితుడుని అరెస్టు చేసిన సిఐ సిహెచ్.ఆంజనేయులు, రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కె.గుర్రయ్య, ఎఎస్ఐ ఎం.గోవిందరావు, కానిస్టేబుల్స్ కెవి.సుబ్బారావు, ఎస్‌కె.అన్వర్, ఎస్‌కె.అక్బర్‌లాల్, కె.మహేష్‌లను జిల్లా ఎస్‌పి ఎం.రవిప్రకాష్ అభినందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పాలకొల్లులో ట్రాఫిక్ సమస్య జఠిలం

పెరుగుతున్న వాహనాలు, రహదారులపై ఆక్రమణలు
ఇబ్బందుల్లో పట్టణ వాసులు
అధికారులు స్పందించాలని వేడుకోలు

బస్టాండ్ వద్ద ట్రాఫిక్

దొడ్డిపట్ల రోడ్డులో ట్రాఫిక్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో ట్రాఫిక్ సమస్య నానాటికీ జఠిలమవుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. రహదారులపై ఆక్రమణలు పెరగడం, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య ప్రతిరోజు జఠిలమవుతోంది. గతంలో వారపు సంత శనివారం మాత్రమే ట్రాఫిక్ సమస్య ఉండేది. ప్రస్తుతం ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. ఎంజి రోడ్డులో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి యడ్ల బజారు వరకు ప్రధాన షాపులు ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఉండేది. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు రూ.కోటితో నాలుగేళ్ల క్రితం సీసీ రోడ్డు నిర్మించడంతో ట్రాఫిక్ సమస్య కొన్నాళ్లు తగ్గినా.. తిరిగి పోలీస్ స్టేషన్ లాకుల కిందకు వెళ్లడం, ఎంజి రోడ్డు ఇరువైపులా ఆక్రమణ పెరగడంతో ట్రాఫిక్ సమస్య గడ్డుగా ఉంది. పిపి రోడ్లో నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో మరింత తీవ్రంగా ఉంటోంది.

పాలకొల్లు సమీపంలోనే భీమవరం జిల్లా రాజధానిగా ఉండటంతో ఇక్కడ హోంగార్డులు ఆరుగురు నుంచి ఎనిమిది మందిని రోజు భీమవరానికి డిప్యుటేషన్‌పై పంపుతున్నారు. దీంతో సాయంత్రం సమయంలో ట్రాఫిక్ క్లియర్ చేసే సిబ్బంది ఉండకపోవడంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. ప్రస్తుతం పట్టణానికి ట్రాఫిక్ ఎస్ఐను కొత్తగా వేసిన సిబ్బంది భీమవరం వెళ్లడంతో ఫలితం కనిపించడం లేదు.

శాఖల మధ్య సమన్వయ లోపం

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆర్అండ్‌బి, ఛాంబర్ సభ్యులతో సమావేశం జరగడం లేదు. గతంలో నరసాపురం సబ్ కలెక్టర్‌గా ఎంటి కృష్ణబాబు, ఆర్‌డిఒగా కన్నబాబు ఉండగా ట్రాఫిక్‌పై సమావేశాలు జరిగాయి. 20 సంవత్సరాల్లో మున్సిపల్ కమిషనర్, సిఐలు ట్రాఫిక్‌పై సమావేశం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. గత నాలుగేళ్లుగా మున్సిపల్ కౌన్సిల్ లేకపోయినా ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న ఏ ప్రత్యేక అధికారి కూడా ట్రాఫిక్‌పై సమావేశం ఏర్పాటు చేయలేదు. కనీసం ఆక్రమణ జోలికి కూడా వెళ్లకపోవడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. రోడ్లపై అధికార పార్టీ నేతలు ఇష్టానుసారం ఆక్రమణలు పెంచి షాపులు నిర్మించినా సబ్ కలెక్టర్ వంటి అధికారులు కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. భీమవరం నియోజకవర్గం నుంచి రోజు పాలకొల్లు వచ్చే కవురు శ్రీనివాస్ కూడా ట్రాఫిక్‌పై సమావేశం ఏర్పాటు చేయడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. జిల్లా అధికారులు, జెడ్‌పి ఛైర్మన్ కూడా ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బంది పడుతున్నా రహదారికి ఇరుపక్కల ఆక్రమణలు తొలగించడంలేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

31 నుంచి గోస్తనీ నది 92వ తీర్థ మహోత్సవాలు

ఏర్పాట్లను పరిశీలించిన నిర్వాహకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నో ఏళ్ల నుంచి ఎంతో విశిష్టత సంతరించుకున్న శ్రీ గోస్తాని నది 92వ తీర్థ మహోత్సవాలు ఈ నెల 31వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తీర్థ మహోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను వారు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ గాదిరాజు కృష్ణంరాజు(బాబు), గుంటూరి రామరాజు మాట్లాడుతూ భీమవరం, పాలకోడేరు, మొగల్లుకు చెందిన ఎఎస్ఆర్ సేవాసమితి, శ్రీ గోస్తాని నది తీర్థోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీగోస్తాని నది 92వ తీర్థోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఈ ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి, 75వ అజాది కా అమృత్ మహోత్సవాలు పురస్కరించుకున్న నేపథ్యం శ్రీ గోస్తాని నది మహోత్సవాలకు 92 ఏళ్లు రావడంతో ఈ మహోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. 31న పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఫిబ్రవరి 1న అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యులకు సత్కారం చేయనున్నమన్నారు. అఖండ అన్న సమారాధన నిర్వహించడంతో పాటు అదే రోజు రాత్రి సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ నటించిన అల్లూరి సీతారామరాజు కలర్ సినిమాను ప్రదర్శించనున్నమన్నారు. ఫిబ్రవరి 2న సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగితాయని చెప్పారు. ఆనాటి నుంచి ఒక లక్ష్యంతో ఈ తీర్థ మహోత్సవాలను జరుపుతున్నామని, దీనికి ఎంతోమంది అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. గోస్తాని నదికి ఉన్న పేరు ప్రఖ్యాతలను కాపాడడంతోపాటు ఈ నదికి పూర్వవైభవం తీసుకొచ్చేలా తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. వీరితో పాటు గొట్టుముక్కల అప్పలరాజు, గాదిరాజు విశ్వనాధరాజు, ఉద్దరాజు సుబ్రహ్మణ్యంరాజు, అయ్యగారి హనుమంతరావు, నాగేశ్వరరావు, గాదిరాజు శ్రీనివాసరాజు ఉన్నారు.

మహోత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న నిర్వాహకులు

భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

రెవెన్యూ సమస్యలు అపరిష్కృతంగా ఎక్కువగా ఉన్న ఆకివీడు, కాళ్ల మండలాల్లో భూ రీసర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భూ కమిషనర్ ఆదేశాల మేరకు ఆకివీడు, కాళ్ల మండలాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు భూ రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆయా మండలాల్లో పనుల వేగవంతానికి అవసరమైన సర్వేయర్లు, సిబ్బంది, రోవర్‌లు, డ్రోన్‌లను ఆయా మండలాలకు కేటాయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయంలోగా భూ రీసర్వే పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

2, 3 తేదీల్లో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించాలనుకోవడం అభినందనీయమని టిడిపి నాయకులు పొత్తూరి రామరాజు అన్నారు. ఈ మేరకు టిడిపి నాయకులు అల్లూరి సాంస్కృతిక కేంద్రం కోశాధికారి బాబుశ్రీని ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా టిడిపి నరసాపురం ఇన్‌ఛార్జి కొత్తూరు రామరాజు మాట్లాడుతూ ఫిబ్రవరి 2, 3 తేదీల్లో ఎస్ఎల్‌జి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఈ శిబిరాన్ని నరసాపురం నియోజకవర్గ ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న బాబు శ్రీని అభినందించారు. మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ అగ్నికుల క్షత్రియ రాష్ట్ర సాధికార కన్వీనర్, రాష్ట్ర బిసి నాయకులు కొప్పాడి రవీంద్రనాథ్‌ఠాగూర్ (రవి) మాట్లాడుతూ శిబిరంలో బిపి, డయాలసిస్ చెక్, ఇసిజి ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. బాబు శ్రీ మాట్లాడుతూ శిబిరానికి వచ్చే ప్రజలు ముందుగా జనవరి నెలాఖరులోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 9866124020 సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల రాష్ట్ర కన్వీనర్ పెండ్ర శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు పద్మ, కొల్లు పెద్దిరాజు, గుబ్బల నాగరాజు, రాంబాబు, పోరాటి పాపారావు, మల్లాడి మూర్తి, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, వెంకటేశులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ఆచంట

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై నిరాశ్రయులైన బాధితులను జనసేన నాయకులు శనివారం పరామర్శించి బియ్యం, కూరగాయలు, వంట సామగ్రి, దుప్పట్లు, దుస్తులు అందించారు. ఆచంట వేమవరం పంచాయతీ పరిధి కంసాల వారి చెరువు గట్టు సమీపంలో నివాసం ఉంటున్న పిచ్చెట్టి సత్యనారాయణకు చెందిన తాటాకిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని జనసేన ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్యప్రకాష్ ఆదివారం పరామర్శించారు. బియ్యం, కూరగాయలు, వంట సామగ్రి, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి జనసేన అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి చిట్టూరి శ్రీనివాస్, మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు నంబూరి విజయ్, నాయకులు సల్లాది పెద్దరాజు, రమేష్, ఉమామహేశ్వరరావు, లక్ష్మణరావు, శేఖర్, అంజిబాబు, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

యండగండిలో తాగునీటి సమస్యకు పరిష్కారం

నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలో మంచినీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని యండగండి గ్రామంలోని సచివాలయం-2 వద్ద 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో నీటి కొరతను తీర్చాలనే ఉద్దేశంతో జలజీవన్ మిషన్‌లో గ్రామానికి కేటాయించిన సుమారు రూ.64 లక్షలను ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి, ఫిల్టర్‌బెడ్, పంపుల నిర్మాణానికి వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ట్యాంక్ నిర్మాణం ద్వారా గ్రామంలో పూర్తిగా నీటి సమస్య తీరుతుందన్నారు. గ్రామంలోని సమస్యలు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న సర్పంచి కృష్ణమూర్తి సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి, మండల పరిషత్ సహ ఉపాధ్యక్షురాలు దత్తాల సుజాతరాణి, నాయకులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

బీచ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్ మొళ్లపర్రు బీచ్‌లో బాల్యమిత్రులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాలకొల్లులోని బిఆర్ఎంవిఎం మున్సిపల్ హైస్కూలులోని 1980-81 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు వట్టం గణేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వేసవిలో చలివేంద్రాల నిర్వహణ, విద్యపరంగా పేద విద్యార్థులకు సహకారం, ఉచిత బస్సు పాసులు అందించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు కంకిపాటి సాంబశివరావు, నీట్ల రమేష్, ముక్కు బాబు, గిరిజాల శ్రీనివాస్, పిల్ల శ్రీనివాస్, ఆర్‌విఎస్.రాజు, చేరుగొండి వెంకటేశ్వరరావు ఉన్నారు.

మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు గణేష్

కరాటే విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

కరాటే విద్యార్థులతో కోచ్ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక మాస్టార్ కేశవ్ షోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు గుంటూరు వద్ద కాకానిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పలు విభాగాల్లో గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించారు. ఆదివారం టైగర్ పవర్ కుంగ్-ఫు, కిక్ బాక్సింగ్ మార్షల్ ఆర్ట్స్ ఒలింపిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. హనుమాన్ జంక్షన్‌లోని కాకాని కళ్యాణమండపంలో నిర్వహించిన ఓపెన్ కుంగ్ ఫు అండ్ కరాటే ఛాంపియన్ షిప్‌లో అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. పదేళ్ల లోపు వ్యక్తిగత కటా విభాగంలో జి.అక్షయ్, 14 సంవత్సరాలలోపు గ్రూపు కటా విభాగంలో ఎస్.భార్గవ్, వి.నాగేందర్, ఎస్.నాగ్‌చరణ్ ప్రథమ బహుమతి సాధించి స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. కాగా వై.పార్థు, జి.సాత్విక్, సిహెచ్.అభినవజయ్ 14 సంవత్సరాల గ్రూపు కటా విభాగంలోనూ పతకాలు సాధించారు. 19 సంవత్సరాల గ్రూపు వ్యక్తిగత విభాగంలో ఘంటా షైనీ గోల్డ్ మెడల్ సాధించింది. మొత్తం ఆరు స్వర్ణ పతకాలు సాధించగా ఒక వెండి పతకం మరొక కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా కోచ్ శ్రీనివాస్‌ను, అంతర్జాతీయ స్థాయిలో గెలిచి స్థానిక పోటీల్లో పాల్గొని గెలుపొందిన షైనీని నిర్వాహకులు సత్కరించారు.

పొంచి ఉన్న ప్రమాదం

మరమ్మతులకు లాకులు
నీటి ప్రవాహంతో కోతకు గురవుతున్న రోడ్డు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు-నరసాపురం జాతీయ రహదారి 216 వెంబడి గల ప్రధాన కాలువ సగం చెరువు వద్ద ప్రమాద భరితంగా ఉంది. నిడదవోలు ప్రధాన కాలువ నుంచి చిట్టవరం గ్రామానికి తాగునీరు వెళ్లేందుకు సగం చెరువు వద్ద నిర్మించిన లాకులు పాడైపోయాయి. రోడ్డు నీటి ప్రవహంతో రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో ఇక్కడ పొంచి ఉన్న ప్రమాదాన్ని హెచ్చరిస్తూ రోడ్లు భవనాల శాఖ వారు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతిరోజు వేలాది వాహనాలు ఈ రోడ్డు మీద ప్రయాణం చేస్తుంటాయి. ఈ క్రమంలో ఎప్పుడూ ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. నీటి ప్రవాహం వల్ల లోపల భూమి కోతకు గురై రోడ్డు దిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న ప్రాంతం

వట్టి వసంతకుమార్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - కాళ్ల

మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ ఉండి ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు ఆదివారం సంతాపం తెలిపారు. కాళ్ల ఎంపిపిగా ఉన్నప్పుడు మంత్రి వట్టి వసంతకుమార్‌ను పలుమార్లు కలిసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన మృతితో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు కార్యదక్షత కలిగిన, విలువలు కలిగిన రాజకీయ నేతని కోల్పోగా వసంత్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన అకాల మరణం చెందడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాలకొల్లు : మాజీమంత్రి వట్టి వసంతకుమార్ పార్థివదేహాన్ని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ సందర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పాలకొల్లు నియోజకవర్గం తరఫున పిసిసి సభ్యులు షేక్ మహబూబ్ జాని, కాంగ్రెస్ పోడూరు మండల నాయకులు బోలిశెట్టి భాను ప్రకాష్‌నాయుడు, రొక్కాల బెన్నిపాల్ వసంత కుమార్ మృతదేహంపై పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.

పాలకొల్లులో అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణం రామగుండం వద్ద శ్రీపుంతలో ముసలమ్మ 91వ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో పి.ఉప్పరి, పి.వేణు గోపాలస్వామి, గజ్జరపు రాజ, వంకా రామకృష్ణ, నేదునూరి సూరిబాబు, పేర్ల రాము పాల్గొన్నారు.

In The Court Of The VIIth Addl. Family Judge :: Eluru
D.V.C.APPEAL : 332/2017

Between:
1) Kalakonda Bujjibabu and 2 others
...Appellants /Respondents
AND
2) Smt. Kalakonda Lakshmi Aparna
...Respondent /Complainants

1) Smt. Kalakonda Lakshmi Aparna, W/o. Bujjibabu, C/o. V.T.Ramakrishna, D.No. 20C-1-23, Power Pet Station Road, Power Pet, Eluru-534002, West Godavari District.
2) Kalakonda Yogeswara Venkata Narayana Sai, S/o. Bujjibabu, R/o. Ramachandra Rao Pet, Eluru-534002, W.G.Dt.

పై నంబరు అప్పీల్‌లో రెస్పాండెంట్సు 1 మరియు 2 అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు ఎన్నిసార్లు పంపినా మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు, వాదన నిమిత్తం **ది.01-02-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

బి.వి.కృష్ణారెడ్డి
అడ్వకేట్, డో.నెం.25-3-10, ఏలూరు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **కన్నూరి రత్నకుమారి, భర్త: నారాయణమూర్తి,** బల్లిపాడు, అత్తిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. నా క్లయింటుకు సంబంధించి పబ్లిక నోటీసు జారీ చేయబడినది.

నా క్లయింటు కన్నూరి రత్నకుమారికి ఈ క్రింది షెడ్యూలు సెటిల్‌మెంట దస్తావేజుగా కన్నూరి నారాయణమూర్తి, కన్నూరి దుర్గ అనంత నాగప్రసాద్ మరియు కన్నూరి రామకృష్ణ సాయి మల్లారావు ద్వారా డాక్యుమెంటు నెం. 5276/2021న వ్రాసి యిచ్చినారు. ఆ డాక్యుమెంటుకు సంబంధించిన లింకు డాక్యుమెంటు తేదీ 08-04-2015న డాక్యుమెంటు నెం. 984/2015రు బల్లిపాడు నుండి అత్తిలికి మోటారు సైకిల్ పై ది.25-01-2023న వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన లేక ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ ప్రకటన ఇచ్చిన 7 రోజులలోపుగా ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

షెడ్యూలు హద్దులు

ప॥గో॥జిల్లా, అత్తిలి మండలం, అత్తిలి ఎస్.ఆర్.ఓ. పరిధి, బల్లిపాడు గ్రామ పంచాయితీ, రి.స.నెం. 183/1రు దాఖలా చ॥గ॥115లు సెంట్లు ఖాళీ నివేశ్న స్థలమునకు హద్దులు:
తూర్పు: కన్నూరి శోభనాద్రి గారి స్థలం.
పడమర: పంచాయితీ సిమెంటు రోడ్డు.
ఉత్తరం: కన్నూరి ప్రసాద్ గారి తాలూకు ఆస్థి.
దక్షిణం: ఆకుల రామకృష్ణ గారి స్థలం.

పమ్మి వి.నాగ వీరభద్రుడు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
సెల్: 77023 11197

PUBLIC NOTICE

This Public Notice is given on the instructions of My Client **Kannuri Ratna Kumari, W/o. Narayana Murthy** of Ballipadu Village, Attili Mandal, West Godavari District.

That my client has acquired the below mentioned schedule property under a Regd. Settlement Deed No. 5276/2021 executed by Kannuri Narayana Murthy, Kannuri Durga Anantha Naga Prasad and Kannuri Rama Krishna Sai Yallarao to that Document Link Document No. 984/2015 was Lost During My Client Travelling from Ballipadu to Attili by Two Wheeler on 25-01-2023. Therefore this Public Notice is issued to all that anybody has of the said Original Lost Documents / Claim / Right / Objection Over the schedule Property, they shall came forward with Documentary Proof within Seven (7) Days form the date of this Notice to the Undersigned, else if shall bw deemed that there are no Claims (or) Objections Over the Schedule Property, and the Transaction will be Proceeded with.

DOCUMENT SCHEDULE

West Godavari District, Attili Mandal, Ballipadu Village in R.S.No. 183/1 of Site 115 Sq. Yards following boundaries:
East: Site of Kannuri Sobhanadri.
South: Site of Akula Rama Krishna.
West: Panchayat Cement Road.
North: Property of Kannuri Prasad.
Within the boundaries site with all Easementary Rights.

PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem, W.G.Dist.
Cell: 77023 11197